వేలం సరే.. అభివృద్ధి ఏది?

- ఓ సిటీలో వసతులు కల్పించని కుడా అధికారులు
- మూడు దశాబ్దాలుగా కొనసాగుతున్న అభివృద్ధి పనులు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా పార్కులు
- నేడు ఓ సిటీలో మిగిలిన ప్లాట్లకు వేలం

వరంగల్: కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) ఎంతో ఆర్భాటంగా 1994లో ఏర్పాటు చేసిన ఓరుగల్లు సిటీ (ఓ సిటీ) పేరిట ప్లాట్ల అమ్మకాలు చేపడుతూ అభివృద్ధిని విస్మరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వేలంలో ప్లాట్లను అధిక ధరలకు విక్రయిస్తూ మౌలిక వసతుల కల్పనపై శ్రద్ధ చూపడం లేదు. అంతర్గత రోడ్లు, పార్కులు, వాకింగ్ ట్రాక్‌లు, ప్లేగ్రౌండ్, కమ్యూనిటీ హాళ్లు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీలు, ప్రహరీ, గ్రీనరీ, సెంట్రల్ లైటింగ్, వాటర్ ట్యాంకుల నిర్మాణాలు హామీలకే పరిమితమయ్యాయి. సౌకర్యాలను విస్మరించిన 'కుడా' అధికారులు మరోసారి ఆదివారం మిగిలిన ప్లాట్లను వేలం వేయడానికి రంగం సిద్ధం చేశారు.

సమస్యల తిష్ట

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 19వ డివిజన్‌లో నేషనల్ టెక్స్‌టైల్స్ కార్పొరేషన్ (ఏజే మిల్)కు చెందిన భూమి నుంచి సుమారు 202 ఎకరాలను అప్పటి ప్రభుత్వం 'కుడా' ఆధ్వర్యంలో కొనుగోలు చేసింది. అందులో కార్మికులతో పాటు ఇతర అవసరాలకు కేటాయించగా మిగిలిన 117 ఎకరాల్లో 'ఓ సిటీ' పేరుతో గేటెడ్ కమ్యూనిటీ ఏర్పాటు చేసేందుకు ప్లాట్లు చేసి విక్రయించింది. ఓ సిటీ ఆవిర్భవించి 30 ఏళ్లైనా పూర్తిస్థాయిలో కుడా


నర్సంపేట రోడ్డుపై ఉన్న ఓ సిటీ ప్రధాన ద్వారం


ఓ సిటీలో ప్లాట్ల వేలం కోసం అధికారులు ఏర్పాటు చేసిన షామియానాలు

అధికారులు వసతులు కల్పించలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చిల్డ్రన్ పార్కులు, సీసీ కెమెరాల నిర్వహణను పట్టించుకోవడం లేదు. సుమారు రూ.70 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ పూర్తిస్థాయిలో వెలగడం లేదు. ఓకేజీలతో తాగునీరు సరిగా సరఫరా కాకపోవడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పూర్తికాకపోవడంతో రోడ్లపై మురుగు నీరు ప్రవహిస్తోంది. దీంతో దోమలు వృద్ధి చెంది స్థానికులు వ్యాధుల బారిన పడుతున్నారు. ఓసిటీ చుట్టూ ప్రహరీ నిర్మించి గేటెడ్ కమ్యూనిటీగా తీర్చిదిద్దుతామని అధికారులు హామీ ఇచ్చి విస్మరించడంతో పశువులు, కుక్కలు, పందులు యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. కాలనీలో రోడ్లపై సూచిక, హెచ్చరిక బోర్డులు విరిగిపోయాయి.


ఓ సిటీ ప్రధాన రోడ్డులో వెలగని వీధి దీపాలు

పనిచేయని సీసీ కెమెరాలు

ఓ సిటీ చుట్టూ ప్రహరీ, సెక్యూరిటీ సిబ్బంది లేకపోవడం, రాత్రి వేళ వీధిదీపాలు సరిగా వెలుగకపోవడం, సీసీ కెమెరాలు సరిగా పనిచేయకపోవడం, ఎలాంటి భద్రతా చర్యలు తీసుకోకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు ఓ సిటీ అడ్డాగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళల్లో ఇళ్ల ఎదుట పార్కింగ్ చేసిన బైక్‌ల నుంచి దొంగలు పెట్రోల్‌ను అపహరిస్తున్నారు. రాత్రి అయిందంటే యువకులు బైక్‌లపై వచ్చి మద్యం సేవిస్తూ, న్యూసెన్స్ చేస్తున్నా పట్టించుకునే వారు లేకుండా పోయారు.

శంకుస్థాపనలతోనే సరి

ఓ సిటీకి వచ్చే ప్రధాన రహదారులపై నిర్మించతలపెట్టిన రెండు ఆర్చీలకు ఐదేళ్ల క్రితం శంకుస్థాపన చేశారు. ఇందులో ఒకటి మాత్రమే పూర్తి కాగా, మరొకటి అసంపూర్తి పిల్లర్లతో దర్శనమిస్తోంది. కాశిబుగ్గ ఓసిటీ జంక్షన్‌లో నిర్మించనున్న ఆర్చీతోపాటు 80 ఫీట్ల రోడ్డు అభివృద్ధిని అధికారులు పూర్తిగా విస్మరించారు. ప్లాట్ల అమ్మకాల సందర్భంగా కాలనీ కమిటీతో అసంపూర్తిగా ఉన్న ఆర్చీకి ఐదోసారి శంకుస్థాపన చేయించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆదాయం కోసమే ప్లాట్లను వేలం వేస్తున్నారని కాలనీవాసులు అంటున్నారు.

విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వ పింగిళి కళాశాల ప్రిన్సిపాల్ సుహాసిని

విద్యారణ్యపురి: ఆధునిక సమాచార యుగంలో ఎలక్ట్రానిక్ ఆధారిత ఈ-జర్నల్స్, ఈ-బుక్స్ ప్రముఖపాత్ర పోషిస్తున్నాయని, ఈ సదుపాయం ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ కళాశాలలో ఉందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుహాసిని తెలిపారు. ఈ నేషనల్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫర్ స్కాలర్లీ కంటెంట్ (ఎన్‌లిస్ట్) ద్వారా అందిస్తున్న ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాలలో గ్రంథాలయ విభాగం, ఐక్యూఏసీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఎన్‌లిస్ట్ ఓరియెంటేషన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జాతీయ సమాచార నెట్‌వర్క్ అందిస్తున్న ఎన్‌లిస్ట్


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సుహాసిని

ప్రోగ్రాం ద్వారా ఆరువేల జర్నల్స్, 7లక్షల ఈ-బుక్స్ ఇంటర్నెట్ కూడిన అత్యాధునిక డిజిటల్ గ్రంథాలయం అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. కళాశాల లైబ్రేరియన్ డాక్టర్ యుగేందర్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ సురేష్‌బాబు, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ అరుణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రజలను నమ్మించి వంచించిన కాంగ్రెస్


రావు పద్మను సన్మానిస్తున్న బీజేపీ నేతలు

జాతీయ ఓబీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి

హన్మకొండ: ప్రజలను కాంగ్రెస్ పార్టీ నమ్మించి వంచించిందని బీజేపీ నేత, ఓబీసీ కమిషనర్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి ఆరోపించారు. హనుమకొండ దీన్‌దయాళ్ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో బీజేపీ సంస్థాగత పర్వం -2024పై స్క్రీనింగ్ కమిటీ సమావేశం పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలోని 7 మండలాలు, నగరంలోని 29 డివిజన్ల అధ్యక్ష, కార్యదర్శుల నియామకాలపై ఏకాభిప్రాయానికి వచ్చారు. 231 దరఖాస్తులు రాగా, అందులో మండల అధ్యక్ష, కార్యదర్శులు, నగరంలోని డివిజన్ల అధ్యక్ష, కార్యదర్శుల పదవులకు ముగ్గురు చొప్పున పేర్ల జాబితాను రాష్ట్ర పార్టీకి పంపించారు. ఈ సందర్భంగా సభ్యత్వ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేసిన బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మను తల్లోజు ఆచారి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు, నాయకులు సన్మానించారు. సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి పేద్దోళ్ల గంగారెడ్డి, మాజీ మంత్రి విజయ రామారావు, మాజీ మేయర్ రాజేశ్వర్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఒంటేరు జైపాల్, నాయకులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ పూర్వ విద్యార్థినుల సమ్మేళనం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని మహిళా ఇంజనీరింగ్ పూర్వ విద్యార్థినుల సమ్మేళనం కళాశాలలో శనివారం జరిగింది. 2013లో ప్రారంభమైన ఆ కళాశాలలో చదివి వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థినులు ఒకచోట చేరి నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భిక్షాలు మాట్లాడుతూ పూర్వ విద్యార్థినులు కళాశాల అభివృద్ధిలో భాగస్వాములు కోరారు. ఇంజనీరింగ్ కళాశాల ఎస్ఎఫ్‌సీ కోర్సులను రెగ్యులర్ కోర్సులుగా మార్చేందుకు యూనివర్సిటీ వీసీ కృషి చేస్తున్నారని చెప్పారు. అకాడమిక్ కోఆర్డినేటర్ వేణుగోపాల్ రెడ్డి, కన్వీనర్


విద్యార్థినులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

పీపీ.వైష్ణవి, కళాశాల టీపీఓ బొల్లం కిరణ్, అధ్యాపకులు తూర్పాటి వెంకటేష్, సురేందర్, సాయితరుణ్, వాణిశ్రీ, డాక్టర్ వేణు, స్వప్న, దీప్తి, రచన, శ్రీజ, అనూష, జ్యోత్స్న, రమ, జ్యోతి, కిషన్, శ్రీనివాస్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల బారిన పడొద్దు


సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ రమేష్

మామునూరు: విద్యార్థులు, యువత గంజాయి, మద్యం వంటి మత్తు పదార్థాల బారినపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని మామునూరు ఇన్‌స్పెక్టర్ రమేష్ సూచించారు. ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో ఎస్సై కృష్ణవేణి, శ్రీకాంత్, జాగృతి పోలీస్ కళాబృందం సంయుక్త ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నాగమణి, విలియమ్, వెంకటేశ్వర్లు, రత్నయ్య, పూల్‌సింగ్, శ్రీనివాస్, నారాయణ, విక్రమ్, రాజు, చిరంజీవి పాల్గొన్నారు.


హసన్‌పర్తి: మాట్లాడుతున్న ఏసీపీ తిరుమల్

హసన్‌పర్తి నాగారంలో..

హసన్‌పర్తి: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కాజీపేట ఏసీపీ తిరుమల్ సూచించారు. హసన్‌పర్తి మండలం నాగారంలో శనివారం రాత్రి కార్డెన్ సర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మొబైల్‌కు దూరంగా ఉండాలని చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. శాంతి భద్రతల్లో పోలీసులకు సహకారం అందించాలని కోరారు. హసన్‌పర్తి పోలీస్ ఇన్‌స్పెక్టర్ చేరాలు, కమలాపూర్ ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ, ఎల్కతుర్తి పోలీస్ ఇన్‌స్పెక్టర్ పులి రమేష్, ఎస్సై దేవేందర్, రవి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి


అంధ ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న నాయకులు

హసన్‌పర్తి: లూయిస్ బ్రెయిలీ జయంతిని భీమారంలోని ప్రభుత్వ పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగుల ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బిల్లా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ అతి చిన్న వయసులోనే చూపును కోల్పోయినప్పటికీ చదువుకోవాలనే పట్టుదలతో అంధుల పాఠశాలలో లూయిస్ బ్రెయిలీ విద్యనభ్యసించారని పేర్కొన్నారు. అంధులు కూడా సులువుగా చదువుకునే విధంగా ఆరు చుక్కల లిపిని ఆయన కనిపెట్టి వెలుగు ప్రదాత అయ్యారని కొనియాడారు. లూయిస్ బ్రెయిలీని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పాఠశాలలో అంధ ఉపాధ్యాయురాలు స్వరూపరాణిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగ ఉపాధ్యాయులు వాసుదేవారెడ్డి, ఉమాదేవి, సృజన, రవీందర్, చేరాలు, తిరుపతిరెడ్డి, వెంకటేష్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలకు ఉపయోగపడేలా కృషి

కేయూ క్యాంపస్: కాలానుగుణంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా పరిశ్రమలు, వ్యాపార సంస్థలకు తోడ్పడే విధంగా అకౌంటింగ్ పద్ధతులు రూపొందించడానికి కృషి చేద్దామని ఇండియన్ అకౌంటింగ్ అసోసియేషనల్ లోకల్ బ్రాంచ్ చైర్మన్ ప్రొఫెసర్ సీహెచ్.రాజేశం అన్నారు. కాకతీయ యూనివర్సిటీలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలో శనివారం నిర్వహించిన అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. నెలకు ఒక సింపోజియం, ఆరు నెలలకు ఒక సెమినార్, ఎమర్జింగ్ ఇష్యూస్ అండ్ అకౌంటింగ్‌పై సమావేశం నిర్వహించాలని తీర్మానించారు. అనంతరం అసోసియేషన్ వరంగల్ చాప్టర్ నూతన కార్య


సమావేశంలో పాల్గొన్న రాజేశం

వర్గాన్ని ఎన్నుకున్నారు. ప్యాటరన్స్‌గా ప్రొఫెసర్ అమరవేణి, ప్రొఫెసర్ వరలక్ష్మి, ప్రొఫెసర్ నర్సింహాచారి, ఉపాధ్యక్షులుగా డాక్టర్ రాజశేఖర్, దత్తాత్రేయులు, డాక్టర్ చంద్రశేఖర్, జనరల్ సెక్రటరీగా కట్ల రాజేందర్, జాయింట్ సెక్రటరీగా డాక్టర్ గిరిప్రసాద్, కోశాధికారిగా ఫణీంద్ర ఎన్నికయ్యారు.

యువకుల దురుసు ప్రవర్తన

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ ఫాతిమానగర్ ప్రధాన రహదారిపై శనివారం రాత్రి డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులపై ఆకతాయి యువకులు దురుసుగా ప్రవర్తించడంతో పాటు విధి నిర్వహణకు ఆటంకం కలిగించినట్లు తెలుస్తోంది. ద్విచక్ర వాహనంపై ముగురు యువకులు ప్రయాణం చేస్తుండగా పోలీసులు ఆపి బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించడానికి ప్రయత్నించారు. దాంతో మద్యం మత్తులో ఆ యువకులు పోలీసులతో తీవ్ర వాగ్వాదానికి దిగినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు ఫిర్యాదు చేయగా ఆ ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

క్లుప్తంగా

నేడు ఇంటలెక్చువల్ ఫోరం వర్క్‌షాప్

కేయూ క్యాంపస్: బీసీ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో ఈనెల 5న ఫుట్కేసర్ ఔటర్ రింగ్‌రోడ్డు వద్ద జేకే కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించనున్న వర్క్‌షాప్‌ను విజయవంతం చేయాలని రాష్ట్ర నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ డాక్టర్ మేడారపు సుధాకర్, జేఏసీ ప్రధాన కార్యదర్శి తాళ్లపెల్లి నరేష్‌గౌడ్ కోరారు. కేయూలో శనివారం నిర్వహించిన సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. సభలో బీసీల రాజకీయ ఎదుగుదలకు ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలి, రాబోయే స్థానిక సంస్థల్లో బీసీల వ్యూహాలు ఎలా ఉండాలనే అంశాలపై వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు వివరించారు. సమావేశంలో నిరుద్యోగ జేఏసీ ఇన్‌చార్జ్ అభిరామ్ రమేష్, అధ్యక్షుడు గుండెటి సుమన్, రాష్ట్ర నాయకులు పాషా, రమేష్‌చంద్ర, అరుణ్‌కుమార్, కుమార్ స్వామి, రాము తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రైవేట్ ఆస్పత్రుల క్రికెట్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాల ఆధ్వర్యంలో ఈనెల 5నుంచి 26వ తేదీ వరకు సుబేదారిలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు డాక్టర్ అమర్‌నాథ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న పోటీల్లో నగరం నుంచి 32 జట్లు పాల్గొంటాయని పేర్కొన్నారు. విజేత జట్టుకు రూ.50 వేల నగదు పురస్కారం, ట్రోఫీ, రన్నరప్ జట్టుకు రూ.30వేల నగదు పురస్కారంతో పాటు ట్రోఫీని అందజేయనున్నట్లు వివరించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఖిలా వరంగల్: వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ సూచించారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా వరంగల్ ఆర్టీఏ జంక్షన్‌లోని సోషల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై శనివారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు జరగవని చెప్పారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మమత, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రేఖ, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంతేజార్‌గంజ్ స్టేషన్ తనిఖీ


వరంగల్: వరంగల్‌లోని ఇంతేజార్‌గంజ్ పోలీసుస్టేషన్‌ను వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో ఫైళ్లను తనిఖీ చేయడంతో పాటు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన సిబ్బందిలో మాట్లాడుతూ స్టేషన్‌కు బాధితులు, ఫిర్యాదుదారులు వస్తే వారితో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ షుకుర్, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

విద్యార్థుల్లో క్రమశిక్షణ ముఖ్యం



దేశాయిపేట: ఉన్నతంగా ఎదగడానికి విద్యార్థులకు క్రమశిక్షణ ఎంతో అవసరమని లయన్స్ క్లబ్ ఆఫ్ వరంగల్ పోతన లీడర్‌షిప్ చైర్మన్ డాక్టర్ ఆడెపు రవీందర్ అన్నారు. ఎల్బీనగర్ టీచర్స్‌కాలనీలోని మసూంఅలీ పాఠశాలలోని విద్యార్థులకు 600 నోట్‌బుక్స్‌ను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పాఠశాలను దత్తత తీసుకుని ఆరేళ్లుగా విద్యార్థులకు చేయూతనందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు జంగా ధర్మ, లకుం అయిలయ్య, చిలుపూరి కృష్ణ, బీఏఎస్.స్వామి, జోషప్, వడ్నాల నరేందర్, ఎం.ఎల్లయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం కప్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



మడికొండ: సీఎం కప్ క్రీడా పోటీల్లో మడికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు హ్యాండ్‌బాల్, వాలీబాల్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారని పాఠశాల హెచ్ఎం సంధ్యారాణి తెలిపారు. హ్యాండ్‌బాల్ పోటీల్లో 9వ తరగతి విద్యార్థి ఏ.స్నికిత రాష్ట్రస్థాయికి ఎంపికై ద్వితీయ స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, పీడీ రెబెక్కను హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు, ఏపీసీ చైర్ పర్సన్ అరూరి సమత, తదితరులు శనివారం అభినందించారు.

విద్యార్థులకు చేయూత

మడికొండ / హసన్‌పర్తి / కాజీపేట అర్బన్ : కాజీపేట మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాల్లో చదువుతున్న 950 మంది విద్యార్థులకు వరంగల్ అర్బన్ జిల్లా యూత్ అధ్యక్షుడు కేఆర్.దిలీప్‌రాజ్ చేయూతనందించారు. తన జన్మదినాన్ని పురస్కరించుకుని మడికొండ, కడిపికొండ, తరాలపల్లి జిల్లా పరిషత్ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం స్నాక్స్ కోసం రూ.35 వేలను అందజేశారు. మండల పరిధిలోని 154 మంది పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను అందజేశారు. హసన్‌పర్తి మండలంలో పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను నాయకులు పంపిణీ చేశారు.

సంక్షిప్తంగా

సమగ్రశిక్ష ఉద్యోగుల మానవ హారం

విద్యారణ్యపురి: తమకు పేస్కేల్ వర్తింపజేయాలని, రెగ్యులరైజ్ చేయాలని, పలు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమగ్రశిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు చేస్తున్న సమ్మె శనివారంతో 30వ రోజుకు చేరుకుంది. హనుమకొండ, వరంగల్ జిల్లాల సమగ్రశిక్ష ఉద్యోగులు శనివారం హనుమకొండలో మహార్యాలీ నిర్వహించారు. ఏకశిల పార్కు నుంచి కాళోజీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ మానవహారం నిర్వహించారు. సమగ్రశిక్ష వరంగల్ జిల్లా అధ్యక్షుడు దొనికల శ్రీధర్‌గౌడ్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు షఫీ, తదితరులు పాల్గొన్నారు.

ఆ వార్డెన్లపై చర్యలు తీసుకోవాలి

కాజీపేట అర్బన్: బీసీ వెల్ఫేర్ హాస్టళ్లలో సమయపాలన పాటించని వార్డెన్లపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రంజిత్‌కుమార్, బాధ్యులు కోరారు. ఈమేరకు బీసీ వెల్ఫేర్ ఇన్‌చార్జ్ డీడీ లక్ష్మణ్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆదిత్య, చరణ్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

పేద వృద్ధ మహిళలకు దుప్పట్ల పంపిణీ

వరంగల్: వృద్ధులు, యాచకులు ఇబ్బందులు పడుతున్నట్లు గమనించి వారికి ప్రేమ్ హెల్పింగ్ ట్రస్ ఆధ్వర్యంలో రగ్గులు (దుప్పట్లు) పంపిణీ చేసినట్లు ట్రస్ట్ చైర్మన్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు బి.శంకర్, ఎన్.సుగుణ, ఎస్.ఆదిత్య, గోపి, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్ల పంపిణీ

మడికొండ: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 46వ డివిజన్ మడికొండ నగర పంచాయతీ కార్యాలయంలో సిరి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందిన మహిళలకు శనివారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కెనరా బ్యాంకు మేనేజర్ ప్రభాకర్ మాట్లాడుతూ కావాల్సిన వారికి రుణాలు, శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలందరికి కుట్టు మిషన్లు ఇప్పిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మునిగాల సరోజన, సిరి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు డాక్టర్ పరికి సుధాకర్, ఎండీ మహమ్మద్ పాషా, కుమారస్వామి, రాజారాం, అరుణ, శ్రీదేవి, త్రివేణి, స్వప్న, ఉమా, దీప, సింధు, అక్షయ, స్వరూప, సారాలక్ష్మి, సౌజన్య, ధనలక్ష్మి, రూప, తదితరులు పాల్గొన్నారు.

ఆంక్షలు లేకుండా రైతు భరోసా ఇవ్వాలి

హన్మకొండ: ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతు భరోసా సహాయాన్ని ప్రభుత్వం అందించాలని బీఆర్ఎస్ హనుమకొండ సీనియర్ నాయకుడు చల్ల వెంకటేశ్వర్ రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. రైతు భరోసాను ఎగ్గొట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని పేర్కొన్నారు.

టీజీసెట్ నోటిఫికేషన్ విడుదల చేయాలి

హన్మకొండ చౌరస్తా: డీఎల్ నోటిఫికేషన్ కంటే ముందే టీజీ సెట్ -2025 నోటిఫికేషన్ విడుదల చేయాలని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఉన్నత విద్యా మండలి చైర్మన్, టీహెచ్ సెట్ కన్వీనర్ల దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ అజీజ్‌ఖాన్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన ఎమ్మెల్యే



హసన్‌పర్తి: టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను శనివారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పింగిలి వెంకట్రామ్ నర్సింహారెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు బొకే అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మామునూరు: వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారిపై నాయుడు పెట్రోల్ బంక్ సమీపంలో శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం వరంగల్‌కు చెందిన జి.రాములు, టి.అజయ్ కలిసి బైక్‌పై ఇంజనీరింగ్ కళాశాలకు బయల్దేరారు. ఈక్రమంలో వారు వెళ్తున్న బైక్ డివైడర్‌ను ఢీకొట్టి ఆ తర్వాత లారీని ఢీకొట్టింది. దాంతో వారు గాయపడగా, క్షతగాత్రులను 108 వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు

ఖిలా వరంగల్: వరంగల్ శంభునిపేట జంక్షన్‌లోని ట్రాన్స్‌ఫార్మర్‌లో శనివారం మధ్యాహ్నం మంటలు చెలరేగాయి. స్థానికులు వెంటనే విద్యుత్‌ను నిలిపివేసి నీళ్లు చల్లి మంటలను ఆర్పివేశారు.

కేంద్ర సంఘం నేతలను కలిసిన సభ్యులు



హన్మకొండ అర్బన్: టీఎన్‌జీఓఎస్ కేంద్ర సంఘం నేతలను జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో పలువురు సభ్యులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నాంపల్లి టీఎన్‌జీఓస్ భవనంలో కేంద్ర సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మారం జగదీశ్వర్, ముజీబ్‌ను సన్మానించారు.

కేయూ క్యాలెండర్ ఆవిష్కరణ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ రూపొందించిన నూతన సంవత్సరం 2025 క్యాలెండర్‌ను వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేయూ పాలకమండలి సభ్యుడు ప్రొఫెసర్ సురేష్‌లాల్, ఎడ్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ వెంకట్రాంరెడ్డి, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వెంకయ్య, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ, అకుట్ జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు డాక్టర్ నర్సింహారావు, స్వర్ణలత, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూటీఎస్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

కాళోజీ సెంటర్: పీఆర్టీయూటీఎస్ 2025 సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను యూనియన్ నాయకులతో కలిసి వరంగల్ జిల్లా విద్యాశాఖ అధికారి మామిడి జ్ఞానేశ్వర్ శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్టీయూటీఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ గఫార్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కటకం రఘు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పొనుగంటి అశోక్ రావు, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

టీఎస్ యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

వరంగల్ చౌరస్తా: టీఎస్‌యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను వరంగల్ ఎంఈఓ కార్యాలయంలో సంఘం నాయకులు శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ గంప అశోక్, జిల్లా కార్యదర్శి నామోజు శ్రీనివాస్, పోశాల కుమారస్వామి, మండల అధ్యక్షుడు దుద్యాల రవీందర్, ప్రధాన కార్యదర్శి బాదావత్ శ్రీనివాస్, రామరాజు, నరసింహారావు, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

షైన్ హైస్కూల్‌లో 'ఇన్నోఫెస్ట్'



హన్మకొండ: హనుమకొండ బాలసముద్రంలోని షైన్ హైస్కూల్‌లో శనివారం ఇన్నోఫెస్ట్ నిర్వహించారు. హనుమకొండలోని షైన్ హైస్కూల్‌కు చెందిన బ్రాంచీల విద్యార్థులు ఇన్నోఫెస్ట్‌లో పాల్గొని ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు రాజేంద్రకుమార్, మూగల రమ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి విజ్ఞాన ప్రదర్శనను నిర్వహించినట్లు వివరించారు. కార్యక్రమంలో స్కూల్ వైస్ చైర్మన్ మూగల రమేష్, ప్రధానోపాధ్యాయుడు రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పింగిళి కళాశాల విద్యార్థినుల శిక్షణ పూర్తి


విద్యార్థినులతో తేజస్వీ అప్పెరల్ పార్కు యాజమాన్యం

మడికొండ: ప్రభుత్వ పింగిళి కళాశాల ఒకేషనల్ కోర్సు విద్యార్థినులు జాబ్ శిక్షణలో భాగంగా మడికొండ ఇండస్ట్రియల్ ప్రాంతంలో తేజస్వీ అప్పెరల్ పార్కులో రెండు నెలల శిక్షణను పూర్తి చేసుకున్నారు. శిక్షణలో భాగంగా చొక్కాలు, ప్యాంట్లు, కుర్తాలను కత్తిరించడం, కుట్టడం నేర్చుకున్నట్లు అప్పెరల్ పార్కు యజమాని కొడెం కైలాసం, సంపత్‌కుమార్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కవిత మాట్లాడుతూ నేటి రోజుల్లో విద్యార్థులు చదువుతో పాటు ఉపాధి పొందేందుకు కుట్టుశిక్షణ కూడా ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. విద్యార్థినులకు శిక్షణ ఇచ్చినందుకు సంస్థ యజమానులకు అధ్యాపకులు వసంత, శ్రీకళ కృతజ్ఞతలు తెలిపారు.